ఫ్లెక్సీబుల్ సిటీ.. కాకినాడ!

- రహదారులన్నీ బ్యానర్లమయం
- ఫ్లెక్స్ ఫ్రీ సిటీగా ప్రకటించిన కలెక్టర్
- లక్ష్య సాధనలో అధికారులు విఫలం
- ఇబ్బందిపడుతున్న వాహనచోదకులు



స్థానిక బోట్‌క్లబ్ సమీపంలో రోడ్డు పక్కన అనధికారంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



స్థానిక జేఎన్‌టీయూకే ఎదుట డివైడర్‌కు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

బోట్‌క్లబ్: రోడ్డు పక్కన చిన్న జాగా దొరికితే చాలు వెంటనే అక్కడ ఫ్లెక్సీలు కట్టేస్తున్నారు. దీని వల్ల రహదారికి అటువైపు నుంచి ఇటువైపు ఎవరు వస్తున్నారో ఇటుగా వెళ్లేవారికి కనపడకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నగరంలో దాదాపు ఏ వీధి చూసినా ఫ్లెక్సీలు చాలా అధ్వానంగా కనిపిస్తున్నాయి. పోనీ వాటి వల్ల కార్పొరేషన్‌కు ఏదైనా ఆదాయం వస్తోందా అనుకుంటే పొరపాటే. ఏ ఒక్క వ్యాపారసంస్థ కానీ, వ్యాపారులు, రాజకీయ నాయకులు కానీ ఎటువంటి అనుమతి తీసుకోకుండా ఇష్టానుసారంగా వాటిని భారీ పరిమాణాల్లో కట్టేస్తున్నారు. దీంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. స్థానిక సర్పవరం జంక్షన్ మొదలు బోట్‌క్లబ్, నాగమల్లితోట, భానుగుడి, టూటౌన్ బ్రిడ్జి, మెయిన్‌రోడ్డు, మసీద్ సెంటర్, జగన్నాథపురం వరకూ ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు కడుతున్నారు. వీటిని నిరోధించాల్సిన కార్పొరేషన్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు చోద్యం చూస్తున్నారు. అదే ప్రతిపక్ష నాయకులు ఎవరైనా ఎక్కడైనా ఫ్లెక్సీలు కడితే మాత్రం వాటిని వెంటనే తొలగించేస్తున్నారు. కూటమి నాయకులు నిబంధనలు పాటించకుండా విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు కడుతున్నా వాటిని మాత్రం తొలగించడం లేదు. నగరంలో వారంలో రెండు రోజులు ఏదో ఒక కొత్త వ్యాపార సంస్థ కొత్త దుకాణం ఏర్పాటు చేయడం.. సర్పవరం జంక్షన్ మొదలుకొని ఆయా వ్యాపార సంస్థ ప్రాంతం వరకూ వందల కొద్దీ ఫ్లెక్సీలు కట్టడం యథేచ్ఛగా సాగిపోతోంది. ప్రమాదకర మలుపులు ఉన్న ప్రాంతాల్లో సైతం ట్రాఫిక్ కనిపించకుండా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో పలు ప్రాంతాల్లో ఉన్న జాతీయ నాయకుల విగ్రహాల వద్ద ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు.

ఫ్లెక్స్ ఫ్రీ సిటీ పరిస్థితి ఏమిటి?

ఫ్లెక్స్ ఫ్రీ సిటీగా నగరాన్ని ఉంచాలని జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేకాధికారి షణ్మోహన్ సగిలి ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు పక్కన ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు కట్టడంతో ప్రమాదాలు జరుగుతున్న విషయం తెలుసుకుని నగరంలో పలు ప్రధాన ప్రాంతాలను ఫ్లెక్సీ ఫ్రీ సిటీగా ప్రకటించారు. స్థానిక సర్పవరం జంక్షన్ నుంచి భానుగుడి సెంటర్ వరకూ, టూటౌన్ నుంచి జగన్నాథపురం వరకూ, కోకిలా సెంటర్ నుంచి సినిమారోడ్డు, వన్‌టౌన్ స్టేషన్ వరకూ కలెక్టర్ ఫ్లెక్సీ ఫ్రీ సిటీగా ప్రకటించి, అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు జారీ అయ్యి ఏడాది కావస్తున్నా పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు ఫ్లెక్సీ ఫ్రీ సిటీ లక్ష్య సాధనలో పూర్తిగా విఫలమయ్యారు. అధికార పార్టీ ఫ్లెక్సీలతో పాటు, వ్యాపార, వాణిజ్య, వ్యక్తిగత ఫ్లెక్సీలను ఆయా ప్రాంతాల్లో ఇష్టానుసారంగా పెడుతున్నారు. నగరంలో ఉన్న టూటౌన్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి, ముత్తా వారధి, వైఎస్సార్ వారధి, కల్పనా బ్రిడ్జిపైనా ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు.

నిబంధనలు బేఖాతరు

కాకినాడ నగరంలో ఎక్కడైనా ఫ్లెక్సీలు పెట్టుకోవాలంటే కార్పొరేషన్ అధికారులు అనుమతి తీసుకోవాలి. ఎవరైనా నిబంధనలు గాలికి వదిలేసి ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే సంబంధిత వ్యాపార సంస్థ వద్ద అపరాధ రుసుం వసూలు చేయాలి. కానీ నగరంలో నిబంధనలు గాలికి వదిలేశారు. ఎక్కడ పడితే అక్కడ ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు పెడుతున్నా ఎటువంటి అపరాధ రుసుం వసూలు చేయకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారు.

వెంటనే అమలు చేయాలి



కాకినాడ నగరాన్ని ఫ్లెక్స్ ఫ్రీ చేస్తున్నామని ప్రకటించి నెలలు కావస్తున్నా ఇంకా అమలు చేయలేదు. కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదంటే వారు ఏ విధంగా పనిచేస్తున్నారో చెప్పాల్సిన అవసరం లేదు. గాలులు వేసినప్పుడు ఫ్లెక్సీలు వాహనాలపై వెళ్లేవారిపై పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారో కార్పొరేషన్ అధికారులు సమాధానం చెప్పాలి.

కొలగాని వీవీఎస్ మూర్తి, విశ్రాంత ఇంజినీర్

క్లుప్తంగా

ఉత్సాహంగా 'చదవడం మాకిష్టం'



గాంధీనగర్ గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

బాలాజీచెరువు: గాంధీనగర్‌శాఖా గ్రంథాలయంలో ప్రతి ఆదివారం నిర్వహించే చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించేలా ఈ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. గత 135 వారాలుగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. దినపత్రికలతో పాటు అరేబియన్ నైట్స్, తెనాలి రామకృష్ణ, చందమామ కథలు వంటి వాటిని అలవాటు చేస్తున్నామని శ్రీనివాస్ తెలిపారు.

వసతిగృహానికి ఫ్యాన్లు, లైట్లు అందజేత

బోట్‌క్లబ్: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీ సానా సతీష్‌బాబు కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి అన్నారు. స్థానిక కోరంగి బీసీ బాలికల వసతి గృహానికి అవసరమైన ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లు, ఇతర పరికరాలు సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అందించారు.

దాత ఆశయాలకు అనుగుణంగా సేవలు

బోట్‌క్లబ్: దాత ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు చేయాలని జిల్లా దేవదాయశాఖాధికారి కనపర్తి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సినిమారోడ్డులోని మంత్రిప్రగడ వారి సత్రం వ్యవస్థాపకులు మంత్రిప్రగడ నరసింహరావు పంతులు 208 జయంతిని సత్రం ఆవరణలో ఆదివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలదండలు వేశారు. వివిధ ప్రాంతాల నుంచి కాకినాడ వచ్చిన వారికి అప్పటిలో సత్రంలో ఆశ్రయం, భోజనాలు కల్పించేవారని పేర్కొన్నారు. సత్రం నిర్వహణకు కాకినాడలోని ఒక ఖాళీ స్థలం, 23 ఎకరాలు పంట పొలాలు దానం చేసిన మహనీయుడు మంత్రిప్రగడ అని ఆయన అన్నారు. ఆలయ ఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం దాత ఆశయాలకు అనుగుణంగా నిరుపేదల విద్యార్థులు రెండు పూటల అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం నిరుపేదలకు 500 దుప్పట్లు, 500 చీరలు పంపిణీ చేశారు. 2 వేల మంది అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.

శ్రమదానంతో నరేంద్రగిరికి మార్గం



ప్రత్తిపాడు నరేంద్రగిరి శ్రమదానంలో పాల్గొన్న పెద్దాపురం క్రైమ్ సీఐ అంకబాబు తదితరులు

ప్రత్తిపాడు: ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన స్వామి వివేకానంద విగ్రహం ఉన్న ప్రత్తిపాడు నరేంద్రగిరి మెట్ల మార్గం శ్రమదానంతో తిరిగి ఏర్పడింది. స్థానిక జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న నరేంద్రగిరికి పర్యాటకులు వస్తారు. కొండ దిగువ నుంచి పైకి మెట్ల మార్గం ఉన్నా నిర్వహణ లేక తుప్పలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో మెట్ల మార్గం కనుమరుగైంది. ఇటీవల నరేంద్రగిరికి వచ్చిన పెద్దాపురం క్రైమ్ సీఐ ఎల్. అంకబాబు మెట్ల మార్గం మూసుకుపోయి ఉండడాన్ని గమనించి, శ్రమదానంతో మార్గం పునరుద్ధరించాలని సూచించారు. ఈ మేరకు నరేంద్రగిరి అభివృద్ధి కమిటీ ఆదివారం శ్రమదానం చేపట్టి, మెట్ల మార్గం సుగమం చేశారు. శ్రమదానంలో పాల్గొన్న వారికి క్రైమ్ సీఐ అంకబాబు భరతమాత చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, పెద్దాపురం క్రైమ్ సీఐ ఎల్.అంకబాబు, కమిటీ ప్రతినిధులు శింగిలిదేవి సత్తిరాజు, రేపాక ప్రసాద్, జ్యేష్ఠ స్వయం సేవక్ విశ్రాంత ఎంఈఓ ముక్కు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కరప మండల అధికారుల ఫోన్‌నంబర్లు

ఎంపీడీఓ	9346790319
తహసీల్దార్	9849903908
ఈఓ పీఆర్ ఆర్డీ	9849352293
మండల ఇంజనీరింగ్ అధికారి	8886865417
మండల వ్యవసాయాధికారి	8331056589
ఎంఈఓ-1	8008293994
ఎంఈఓ-2	8919940656
హౌసింగ్ ఏఈఈ	7093930450
ఉపాధిపథకం ఏపీఓ	7093998259
వెలుగు ఏపీఓం	9959989273
ఎలక్ట్రికల్ ఏఈ	9440812638
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ	9603007219
ఇరిగేషన్ ఏఈఈ	9704651826
డ్రెయినేజ్‌శాఖ ఏఈఈ	9963744219
ఆర్‌అండ్‌బి ఏఈఈ	9440818530
కరప పీహెచ్‌సీ డాక్టర్	8096940176
వేళంగి పీహెచ్‌సీ డాక్టర్	9962553545
పశుసంవర్ధకశాఖ ఏడీఏ	9490047668
నడకుదురు వెటర్నరీడాక్టర్	9652547579
వేళంగి వెటర్నరీ డాక్టర్	8332973558

పోలీసుల కార్డన్ సెర్చ్



దుమ్ములపేట అపార్టుమెంట్ల వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

కాకినాడ రూరల్: అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానిత ప్రాంతాలలో పోలీసులు నిఘా పెట్టారు. సర్పవరం పోలీస్ స్టేషన్ పరిధిలో కాకినాడ అర్బన్ దుమ్ములపేట అపార్టుమెంట్ల వద్ద ఆదివారం తెల్లవారు జామున నాలుగు గంటలకు కార్డెన్ అండ్ సెర్చ్‌లో నాలుగు బృందాలు పాల్గొని విస్తృతంగా తనిఖీ చేశాయి. ఈ తనిఖీలో రికార్డులు సక్రమంగా లేని 17 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని, అనుమానాస్పదంగా కనిపించే కొత్త వ్యక్తుల వివరాలు సేకరించారు. గంజాయి నిల్వ చేసే ప్రదేశాలను గుర్తించి తదుపరి చర్యలు చేపట్టారు. తనిఖీల్లో సర్పవరం సీఐ పెద్దిరాజు, కాకినాడ సీపీఎస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, సర్పవరం పీఎస్ ఎస్సైలు ఆచార్యులు, లలితాదేవి, సబ్ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు. ఇంద్రపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో కొవ్వూరు గ్రామంలోను పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. రూరల్ సీఐ చైతన్య కృష్ణ, ఎస్సై వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



భగవద్గీత పోటీల్లో శ్లోకాలు చెబుతున్న విద్యార్థి

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం వైష్ణవ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఎంతో వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ఆలయ అర్చకులు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో చిన్నారులకు పలు పోటీలు నిర్వహించారు. చిన్నారులకు భగవద్గీత పోటీలు నిర్వహించారు. ఎల్‌కేజీ నుంచి ఐదో తరగతి వరకూ సబ్ జూనియర్స్ గాను, 5, 6, 7 తరగతుల వారిని జూనియర్స్ గాను, 8,9,10 తరగతులను వారిని సీనియర్స్‌గా పరిగణించి భగద్గీతలోని 12వ అధ్యాయంలో శ్లోకాల పోటీలు నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణుని చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. శ్రీకృష్ణుడిని ఇతివృత్తంగా చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు ఆలయ కమిటీ చైర్మన్ వెత్సా మురళి, ఈఓ ఆర్.రాజేశ్వరరావు బహుమతులు అందించారు. ఈ పోటీలకు వి.కృష్ణ కన్వీనర్‌గా వ్యవహరించారు.

ఓజోన్ పొర సంరక్షణ అందరి బాధ్యత



ప్రతిభ చూపిన విద్యార్థులు

బాలాజీచెరువు: ఓజోన్ పొరను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా కో-ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో ఆదివారం వివేకానంద పార్కు ప్రాంగణంలో చిత్రలేఖనం, ఏకపాత్రాభినయం పోటీలను పర్యావరణ అవగాహన లక్ష్యంగా నిర్వహించారు. ఆరో తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న 227 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సృజనాత్మక ప్రతిభ ప్రదర్శించారు. ఈ సందర్భంగా కేసరి శ్రీనివాసరావు మట్లాడుతూ చిన్నతనం నుంచే పర్యావరణాన్ని పరిరక్షించడం అలవాటుచేయాలని, వారిలో చైతన్యం పెంపొందింపజేయడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో ఎం.శ్రీనివాసరావు, పిల్లి గోవిందరాజులు, రమణామూర్తి, లత, రామకృష్ణ పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే పంతం నానాజీని కలిసి వినతి పత్రం అందజేసిన 104 జిల్లా సంఘం సభ్యులు

కరప: గత కొంతకాలంగా వివిధ సమస్యలతో సతమతమవుతున్న 104 ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని 104 ఉద్యోగుల జిల్లా సంఘం ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీని 104 జిల్లా యూనియన్ అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు, ఉద్యోగులు కలిసి సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. గత యాజమాన్యం అరబిందో కంపెనీ నుంచి తమకు రావలసిన బకాయిలను, చట్టపరమైన చెల్లింపులను చెల్లించాలన్నారు. ప్రస్తుత యాజమాన్యం భవ్య సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ బఫర్ ఉద్యోగులను తీసుకోవాలని, నెలకు ఒక క్యాజువల్ లీవ్ ఇచ్చేలా కొనసాగించాలని పేర్కొన్నారు. ప్రస్తుత నిత్యావసర ధరలకు అనుగుణంగా జీవో 7 ప్రకారం డీఈఓలకు 18,500 జీతం, అలాగే డ్రైవర్లకు స్లాబ్ విధానం అమలు చేయాలన్నారు.

గ్రామీణ ప్రాంతాలలో సేవలందిస్తున్న 104 వాహనాలలో మందుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఈఎస్ఐ, పీఎఫ్‌లు సక్రమంగా అమలు చేయాలని, ఈఎస్ఐ అమలు కాని ఉద్యోగులందరికీ ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో డివిజన్ నాయకుడు హరిప్రసాద్, ఎస్కే కాలీషా, శ్రీను ఇతర ఉద్యోగులు ఉన్నారు.

వేదం ధర్మమే చెబుతుంది



కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకట సత్య నరసింహ శాస్త్రి

బోట్‌క్లబ్: వేద ధర్మం పురాణం చెబుతుందని ఆస్వాదన సాహితీ సమితి వ్యవస్థాపకుడు గొట్టుముక్కల వెంకట సత్య నరసింహ శాస్త్రి అన్నారు. సేవా భారతి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన అష్టాదశ పురాణ పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, భగవద్గీతలలో విషయాలు అమృతవాక్కులన్నారు. విష్ణు పురాణం వర్తమాన కాలంలో అనేక విశేషాలు ప్రస్ఫుటమయ్యాయనని ఆయన విశ్లేషించారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త కాశీభొట్ల సత్యనారాయణ, కాకరపర్తి దుర్గాప్రసాద్, ప్రముఖ పంచాంగకర్త డాక్టర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుకు సాయం

కాకినాడ క్రైం: స్థానిక ఆశ్రమ్ స్కూల్‌లో మూడు, ఒకటో తరగతి చదువుతున్న అన్నా చెల్లెళ్లకు శ్రీ యువసేన స్వచ్ఛంద సంస్థ సాయం అందించింది. విద్యార్థుల చదువు నిమిత్తం రూ.40 వేలు మొత్తాన్ని సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లం సతీష్ పిల్లల తల్లిదండ్రులకు కాకినాడలోని గ్లాస్ హౌస్ సెంటర్‌లోని శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్‌లో అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి



రవిని సత్కరిస్తున్న ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రధానోపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చేవూరి రవి పేర్కొన్నారు. స్థానిక రామకృష్ణ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు మేడిశెట్టి కుర్మారావు అధ్యక్షతన సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు మధ్య అనుసంధానంగా ఉంటూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. కాకినాడ అర్బన్ మండల విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న తనను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించి బాధ్యతలు మరింత పెంచారన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టభద్రుల ఎంఎల్‌సీ పేరాబత్తులు రాజశేఖర్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా మరిడమ్మ తీర్థ మహోత్సవం



మరిడమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

సీతారామపురంలో మరిడమ్మవారు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామ దేవత మరిడమ్మ వారి తీర్థ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామ పురోహితులు కందికొండ వెంకట కృష్ణయ్య, భాస్కర శర్మ తదితరుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని గరగ నృత్యాలు, తప్పెట గుళ్ల తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపుగా ప్రధాన ఆలయానికి తీసుకువచ్చారు. భక్తులు అమ్మవారికి మొక్కుబడులు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ టేకుమూడి లక్ష్మణరావు, సెక్రటరీ సంగాడి వీరప్రసాదరావు, వైఎస్ చైర్మన్ పెమ్మాడ కాశీవిశ్వనాథం, సహాయ కార్యదర్శి దడాల భైరవస్వామి, కందికొండ భాస్కరశర్మ, సమనస వీరభద్రరావు, మందా సుబ్రహ్మణ్యం, కాద నాగేశ్వరరావు, అత్తిలి బాబూరావు పాల్గొన్నారు.

పురాతన ఆరోగ్య శాస్త్రం యోగా



కార్యక్రమంలో మాట్లాడుతున్న యోగా గురువు డాక్టర్ జ్యోతుల నాగేశ్వరరావు

బోట్‌క్లబ్: పురాతన ఆరోగ్యశాస్త్రం యోగా అని యోగ భారత్ ఫౌండేషన్ చైర్మన్, యోగా గురువు డాక్టర్ జ్యోతుల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక సత్కళావాహినిలో ఆరోగ్య ప్రదాతతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రోగ నిరోధక శక్తి పెరగడానికి యోగా దోహదపడుతుందనీ, తద్వారా జనం రోగాల బారిన పడకుండా ఉంటారని ఆయన పేర్కొన్నారు. ఒత్తిడిని అధిగమించే శక్తి అల్లోపతి సహా ఏ ఇతర వైద్య విధానాల్లోనూ ఇంతవరకు రాలేదన్నారు. కేవలం యోగా సాధనే దానికి ఔషధం అన్నారు. ఉరుకులు, పరుగుల జీవితంలో సగటు మనిషి అనేక రోగాల బారిన పడుతున్నారన్నారు. రోగనిరోధక శక్తి వేరు, రోగ నివారణ శక్తి వేరని, వీటిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే యోగ భారత్ ఫౌండేషన్ ధ్యేయమన్నారు. వైద్య విధానంలో మూలాలను పట్టుకోకపోవడం వల్లే రోగాలు నయం కావడం లేదన్నారు. నాడీ శుద్ధి ప్రాణాయామంతో గుండె వ్యాధులకు చెక్ పెట్టవచ్చని ఆయన స్పష్టం చేశారు. ధ్యానం చేయడం ద్వారా మనిషిలో ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. రోగరహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా యోగ ఫౌండేషన్ పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు శ్రీహరి పాల్గొన్నారు.

అలరించిన ఘంటసాల బయోపిక్



ఘంటసాల బయోపిక్ దర్శక నిర్మాత చిత్తజల్లు రామారావును సత్కరిస్తున్న సాహితీ స్రవంతి సభ్యులు

బోట్‌క్లబ్: ఘంటసాల బయోపిక్ కాకినాడ ప్రేక్షకులను అలరించింది. స్థానిక పద్మప్రియ థియేటర్‌లో గానగంధర్వ ఘంటసాల బయోపిక్ చిత్రం ప్రివ్యూ షో ఆదివారం ప్రదర్శించారు. వేలాది సినిమా పాటలు, భగవద్గీత వంటి భక్తిగీతాలను అశేషంగా ఆలపించి తెలుగువారి గుండెల్లో స్థానం సంపాదించుకున్న అమర గాయకుడు ఘంటసాల బయోపిక్ చాలా బాగుందని నగర ప్రజలు మైమరచిపోయారు. ఘంటసాల పాత్రలో ప్రముఖ గాయకుడు కృష్ణచైతన్య నటించారు. బయోపిక్ తీసిన దర్శక నిర్మాత చిత్తజల్లు రామారావు పద్మప్రియ థియేటర్‌లో ప్రివ్యూ షో తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల జీవితాన్ని బయోపిక్‌గా తీసి, తెలుగు ప్రేక్షకులకు కానుకగా అందజేయాలన్న చిరకాల కోరిక తీరిందన్నారు. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత రామారావును సాహితీ స్రవంతి నగర అధ్యక్షుడు మార్ని జానకిరామ చౌదరి, పున్నమరాజు ఉమామహేశ్వరరావు, పైండా వెంకటనారాయణ, తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



అందుకున్న పతకాలతో శ్రీను

రౌతులపూడి: ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-14 జూనియర్ ఫెడరేషన్ పోటీల్లో బలరామపురం గ్రామానికి చెందిన పైల శ్రీను ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. రౌతులపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శ్రీను జిల్లా స్థాయి షార్ట్‌పుట్, జావెలిన్ త్రో పోటీల్లో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీను ఈ నెల 25, 26 తేదీల్లో ఏలేరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్టు అధికారులు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన శ్రీను, అతని తల్లిదండ్రులను గ్రామస్తులు అభినందించారు.